సాక్షి మహబూబ్‌నగర్

ఆదివారం । 29 । జనవరి । 2023



సమష్టిగా నిర్వహిద్దాం

మన్యంకొండ ఉత్సవాలు సమష్టిగా నిర్వహిద్దామని అదనపు కలెక్టర్ తేజస్ అన్నారు.

వివరాలు 8లో ▸



వైభవంగా రథోత్సవం

మక్తల్ మండలం మాద్వార్ గట్టుతిమ్మప్ప రథోత్సవం వైభవంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం 32.4 /16.9

వాతావరణం

ఉదయం, రాత్రి సమయాల్లో చలి తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం పాక్షికంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

వేరుశనగ @ రూ.8,637

జడ్చర్ల/ దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం వేరుశనగకు గరిష్ఠంగా రూ.8,637, కనిష్ఠంగా రూ.6,089 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు రూ.2,241, పెబ్బర్లకు రూ.5,611, రాగులకు రూ.1,827, హంసకు రూ.1,939, పొద్దుతిరుగుడుకు రూ.5,160 ఒకే ధర వచ్చాయి. కందులకు గరిష్ఠంగా రూ.6,799, కనిష్ఠంగా రూ.6,420, పత్తి గరిష్ఠంగా రూ.7,789, కనిష్ఠంగా రూ.5,309 చొప్పున పలికింది.

కందుల ధర రూ.6,921

దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో కందుల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,921, కనిష్ఠంగా రూ.6,850గా ధరలు నమోదయ్యాయి. వానాకాలం దిగుబడులు ముగియడంతో మార్కెట్‌లో లావాదేవీలు తక్కువగా సాగుతున్నాయి.

అంగన్‌వాడీలకు అండగా బీఆర్‌ఎస్ సర్కారు



మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్రంలోని అంగన్‌వాడీలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ , క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతనంగా నియామకమైన 22 మంది అంగన్‌వాడీ టీచర్లకు ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉండేదో అంగన్‌వాడీ టీచర్లకు బాగా తెలుసన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతుందని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామాల్లోని చిన్నారులు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తుందని చెప్పారు. గ్రామీణ పేదల కోసం కష్టపడుతున్న అంగన్‌వాడీ సిబ్బందికి తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే గుర్తింపు లభించిందని, వారికి పదోన్నతులు కూడా దక్కడం ఎంతో సంతోషించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ సుధాశ్రీ, డీడబ్ల్యూఓ జరీనా, సీడీపీఓలు రాజేశ్వరి, శాంతిరేఖ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు మరో ఉద్యమం

- వీఆర్‌ఏ జేఏసీ నాయకుల హెచ్చరిక



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తమ న్యాయమైన హక్కుల సాధన కోసం మరో ఉద్యమం చేసేందుకు వీఆర్‌ఏలు సిద్ధం కావాలని వీఆర్‌ఏ జేఏసీ జిల్లా చైర్మన్ రామచంద్రయ్య అన్నారు. శనివారం స్థానిక టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించిన వీఆర్‌ఏ జేఏసీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరిస్తామని ఇది వరకే సీఎం కేసీఆర్ ప్రకటించారని, ఇప్పటికైనా వాటిని అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. వీఆర్‌ఏ పే స్కేల్ అమలు చేయాలని, 55 ఏళ్లు నిండిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. గతంలో 83 రోజులపాటు సమ్మె చేయగా.. సమస్యలను పరిష్కరిస్తామని కేటీఆర్ ఇచ్చిన హామీ మేరకు సమ్మె విరమించి 100 రోజులు అవుతుందన్నారు. నేటికీ డిమాండ్లు పరిష్కరించనందునే మరోసారి సమ్మె చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో వీఆర్‌ఏ జేఏసీ కోచైర్మన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి రాధికారెడ్డి, కన్వీనర్ ఎండీ మునీర్, కార్యదర్శి సత్యనారాయణ, యాదగిరి, గోవర్ధన్, రవి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు ఆల్‌మేవా సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రం మినీ ట్యాంక్‌బండ్ సమీపంలోని ఆర్‌బీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ ఇష్రత్‌అలీ, మహ్మద్ అయూబ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఆల్‌మేవా డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ ఉంటుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ హాజరవుతారన్నారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని ఆల్‌మేవా శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.



గోపాల్‌పేట మండలం మున్ననూరు గ్రామం చెప్పుకొనేందుకు ఓ చిన్న పల్లెటూరు. కానీ, అది సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, కట్టుబాట్లకు నిలయం. దట్టమైన గుట్టల మధ్య 2,600 జనాభా ఉన్న ఆ గ్రామంలో భక్తిభావం కూడా ఎక్కువే. యుద్ధంలో విజయానికి చిహ్నంగా 237 ఏళ్ల క్రితం ఇక్కడి ఏకశిల ఆంజనేయస్వామి ఆలయంలో బొబ్బిలి రాజవంశీయులు వెలిగించిన అఖండ దీపం నేటికీ ప్రజ్వరిల్లుతోంది. శబరిమలైలో ప్రతి సంక్రాంతి పండగకు మకరజ్యోతిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివెళుతుంటారు. మున్ననూరులోని ఆంజనేయస్వామి ఆలయంలో వెలుగుతూనే ఉన్న అఖండజ్యోతిని దర్శించుకునేందుకు నిత్యం గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివస్తుంటారు. గ్రామంలో ఓ అర్చక కుటుంబం ఐదు తరాలుగా జాగ్రత్తగా చూసుకుంటున్న చారిత్రక అఖండజ్యోతిపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

- చెంచెటి హరిప్రసాద్, మహబూబ్‌నగర్ డెస్క్

అఖండజ్యోతి

సండే స్పెషల్

మున్ననూరులో 237 ఏళ్లుగా వెలుగుతున్న దీపం

- యుద్ధంలో విజయానికి చిహ్నంగా ఆలయంలో జ్యోతి వెలిగించిన బొబ్బిలి రాజవంశీయులు
- ఐదుతరాలుగా అఖండ దీపాన్ని కాపాడుతున్న ఓ అర్చక కుటుంబం
- గ్రామస్తుల విరాళాలతో తైలం అందిస్తున్న వైనం

ప్రస్తుతం 650 కుటుంబాలు నివాసముంటున్న మున్ననూరు గ్రామానికి కూడా ఓ ఘనమైన చరిత్ర ఉంది. గ్రామానికి సమీపంలో మునీశ్వరుల గుట్ట ఉంది. ఇక్కడ మునులు తపస్సు చేసేవారని.. మునులు సంచరిస్తున్నందుకు ఈ ఊరికి మునునూరుగా పేరొచ్చిందని గ్రామస్తులు చెబుతున్నారు. కాలక్రమేణా అది మున్ననూరుగా మారింది. కాగా, 237 ఏళ్ల క్రితం ఆంధ్రా పాలకులు బొబ్బిలి వంశానికి చెందిన రాజులు శత్రువులపై యుద్ధానికి వెళ్లే సమయంలో గోపాల్‌పేట సంస్థానం మద్దతు కూడగట్టుకుంటూ ఇక్కడి రాణి రంగనాయకమ్మతో ఓ సంధి చేసుకున్నారు. అలాగే యుద్ధానికి వెళ్లే దారిలో ఉన్న మున్ననూరులోని ఏకశిలా విగ్రహ రూపంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఓ రోజు రాత్రి బస చేశారు. యుద్ధంలో గెలిస్తే చీకటిగా ఉన్న ఆలయంలో అఖండజ్యోతిని వెలిగిస్తామని వారు మొక్కుకున్నారు. ఆ యుద్ధంలో శత్రురాజులపై గెలిచిన బొబ్బిలి వంశీయులు తిరుగు ప్రయాణంలో ఆలయంలో ఆముదం నూనెతో అఖండ జ్యోతిని వెలిగించినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. ఆ తర్వాత సుదూరం ప్రాంతం నుంచి అఖండ జ్యోతి వెలిగించడానికి తైలం, వత్తులను పంపేందుకు ఇబ్బంది కావడంతో.. గోపాల్‌పేట సంస్థానం రాణి రంగనాయకమ్మకు తైలం పంపించాలని, అందుకు అయ్యే ఖర్చును తామే భరిస్తామని బొబ్బిలి రాజులు వర్తమానం పంపారు. అప్పటి నుంచి దీపానికి కావాల్సిన నూనెను రాణి పంపించారు. ఆ తర్వాత కాలంలో గోపాల్‌పేట సంస్థానాధీశులు స్వయంగా అఖండ జ్యోతి, ఆలయ, అర్చకుల ఆలనాపాలనా చూసుకున్నారు. రాజరికపాలన అంతరించిన తర్వాత కూడా గ్రామంలోని పెద్దలు విరాళాలు సేకరించి.. ఆ డబ్బులతో తైలం అందించి దీపాన్ని వెలిగిస్తూ ఉన్నారు. ప్రస్తుతం ఆలయ దీపం కోసం రూ.65 వేల విరాళం ఉంది. ఈ డబ్బుపై వచ్చే వడ్డీతో ఆలయ దీపాన్ని వెలిగిస్తున్నారు.




వెలుగుతున్న అఖండ జ్యోతి.. ఆంజనేయస్వామి మూల విగ్రహం

ప్రతి ఏటా ఉత్సవాలు..

ప్రతి ఏటా శ్రావణమాసం, కార్తీక మాసంతో పాటు హనుమాన్ జయంతి సందర్భంగా వీరాంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇప్పటికీ గ్రామంలో శుభకార్యాలకు, ప్రత్యేక పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో గ్రామస్తులు అఖండ జ్యోతిని దర్శించుకుని వెళ్తారు. శత్రువులపైకి దండయాత్రకు, ముఖ్యమైన పని కోసం వెళ్లే ముందు వనపర్తి సంస్థానాధీశురాలు రాణి జానకమ్మ ఈ ఆలయంలో పూజలు చేసి, అఖండజ్యోతిని దర్శించుకుని వెళ్లేవారని గ్రామపెద్దలు చెబుతున్నారు. ప్రతిరోజూ ఆలయంలో రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకు భజన చేస్తారు.

- కపిలవాయి లింగమూర్తి రాసిన 'పాలమూరు ఆలయాలు' పుస్తకంలో మున్ననూరు అఖండ జ్యోతి విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. శ్రీలంకలో బుద్ధుడి కాలంలో వెలిగించిన అఖండ జ్యోతి ఉందని.. అలాంటిదే మున్ననూరులోనూ ఐదుతరాల వారు రెండు దశాబ్దాలకు పైగా అఖండ జ్యోతిని కాపాడడం అభినందనీయమని చారిత్రక పరిశోధకులు సైతం చెబుతారు.

ఆలయ పునఃనిర్మాణంతో వెలుగులోకి..

ఈ ఆలయంలో బొబ్బిలి వంశం రాజులు వెలిగించిన అఖండజ్యోతిని మున్ననూరులోని ఓ అర్చక కుటుంబం ఐదు తరాలుగా కాపాడుకుంటూ వస్తోంది. వారి వంశం పూర్తిగా ఆలయసేవకే అంకితమైంది. ప్రస్తుతం ఐదో తరానికి చెందిన వెంకటయ్య (వెంకటస్వామి)అనే అర్చకుడు ఆలయంలో పూజలు చేయడంతో పాటు అఖండజ్యోతిని కాపాడుకుంటూ వస్తున్నారు. తన తండ్రి నర్సింహులు, తాత వెంకట్రాములుతో పాటు ముత్తాతలు కూడా ఆలయంలో పూజలు చేయడంతో పాటు అఖండ జ్యోతిని కాపాడినట్లు తమ పూర్వీకులు చెప్పేవారని వెంకటయ్య చెబుతున్నారు.



గర్భగుడిలోని పైకప్పుపై శ్రీచక్రం

- రెండు శతాబ్దాలకు పైగా అఖండ జ్యోతి వెలుగుతూ ఉందనే విషయం 1999 వరకు మున్ననూరుతో పాటు ఆ చుట్టుపక్కల గ్రామాలకు మాత్రమే తెలిసేది. ఆ తర్వాత పూర్వీకులు నిర్మించిన రాతి, మట్టిగోడల శిథిలావస్థకు చేరడంతో.. ఆలయాన్ని పునఃనిర్మాణం చేపట్టారు. ఆ సమయంలో అఖండజ్యోతి విషయం బయటి ప్రపంచానికి తెలిసింది. అప్పటి నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని చాలామంది ఇక్కడి అఖండ జ్యోతిని దర్శించుకున్నట్లు ఆలయ అర్చకుడు వెంకటయ్య తెలిపారు.

- ఆలయాన్ని 2011లో రాష్ట్ర దేవాదాయశాఖలో విలీనం చేశారు. నిబంధనల ప్రకారం అన్ని ధ్రువపత్రాలు సమర్పించి విలీనం చేసినా.. ఆలయంలో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించలేదు. ప్రత్యేక నిధులు కేటాయించి, ఆలయాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తరతరాలుగా కాపాడుకుంటున్నాం..



ఈ దేవాలయాన్ని నమ్ముకుని తరతరాల నుంచి మా కుటుంబం పని చేస్తోంది. అఖండ జ్యోతిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళితే.. ఆలయం పక్కనే ఉన్న ఓ కుటుంబానికి దీపం కాపాడే బాధ్యతను అప్పగిస్తాం. ఆలయంలో హుండీ ఉండదు. ఆలయం పేరు మీద రెండు ఎకరాలు భూమి ఉంది. దేవాదాయ శాఖలో ఆలయాన్ని విలీనం చేసినా ఆ స్థాయి వేతనాలు ఇవ్వడం లేదు. ప్రస్తుతం ఇస్తున్న గౌరవ వేతనం కుటుంబపోషణకు కూడా సరిపోవడం లేదు. ప్రభుత్వం స్పందించి కనీస వేతనం సౌకర్యం కల్పించాలి.

– వెంకటయ్య, ఆలయ అర్చకుడు

ప్రతిరోజూ భజనలు చేస్తాం..



మేము ప్రతిరోజూ గుడిలో భజనలు, కీర్తనలు చేస్తాం. ఆంజనేయ స్వామిని ఎలాంటి కోర్కెలు కోరినా తీరుతాయి. ఇక్కడికి శ్రీశైలం, ఇతర దూర ప్రాంతాల నుంచి వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఎంతోమందికి మంచి జరిగింది. చాలా మహిమ గల ఆంజనేయ స్వామిగా ప్రసిద్ధి చెందింది.

– నిజేంద్రంగౌడ్, మున్ననూరు

ఎంతో చరిత్ర ఉంది..



మా గ్రామ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. మా చిన్నతనంలో మా పెద్దవాళ్లు ఆలయ చరిత్ర చెప్పేవారు. ఆలయానికి మా వంతు సహకారాన్ని అందిస్తున్నాం. అఖండ జ్యోతి కోసం ప్రస్తుతం రూ.65 వేల విరాళం ఉంది. ఆ డబ్బుపై వచ్చే వడ్డీతో దీపం వెలిగిస్తున్నారు.

– సంధ్య, ఎంపీపీ, గోపాల్‌పేట

నిధులు కేటాయించాలి..



మా గ్రామంలోని ఆలయానికి ఎంతో పేరు, ప్రతిష్ఠలు ఉన్నాయి. దాదాపు 237ఏళ్ల చరిత్ర ఉన్న అఖండ జ్యోతిని, ఆంజనేయస్వామిని దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయనే నమ్మకంతో ఇక్కడికి వస్తుంటారు. ప్రభుత్వం కూడా ఆలయానికి ప్రత్యేక నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేసి ప్రచారం కల్పించాలి.

– శేఖర్‌యాదవ్, సర్పంచ్, మున్ననూరు

పైరవీలతో మొదలు..?

- ప్రారంభంలోనే అక్రమ బదిలీలతో ఉపాధ్యాయ వర్గాల్లో కలకలం
- ప్రక్రియ పూర్తికాక ముందే పలువురికి స్థానచలనం
- వాటిని వెంటనే రద్దు చేయాలని పలు సంఘాల ఆందోళన
- 50 మంది స్పౌజ్‌లకు ఆర్డర్ల అందజేత
- వెలువడిన సీనియార్టీ జాబితా, ఖాళీల వివరాలు



డైట్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియను పైరవీలతో ప్రారంభించడం కలకలం చోటుచేసుకుంది. చాలామంది ఉపాధ్యాయులు తాము కోరుకున్న ప్రాంతాలకు బదిలీ కావాలనే ఉద్దేశంతో ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో ప్రక్రియ ప్రారంభంలోనే పలువురు ఉపాధ్యాయులు రాజకీయ పలుకుబడితో తమకు కావాల్సిన పాఠశాలలకు అక్రమంగా బదిలీ కావడంపై పలు ఉపాధ్యాయ సంఘాలు భగ్గుమన్నాయి. ప్రభుత్వం పారదర్శకంగా బదిలీలు చేపడతామని చెప్పినప్పటికీ.. ఇలాంటివి చోటుచేసుకోవడంతో పలువురు ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే జిల్లాకు సంబంధించిన సీనియార్టీ జాబితాను విద్యాశాఖ అధికారులు శుక్రవారం రాత్రి ఒంటిగంటకు ఆన్‌లైన్‌లో ఉంచారు. వీటితోపాటు ఖాళీల జాబితాను సైతం ప్రకటించారు. అయితే ఇందులో జనరల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల్లో సబ్జెక్టుల వారీగా ఏ సంవత్సరం డీఎస్సీ వరకు కట్ ఆఫ్ అయిందనే అంశంపై స్పష్టత లేకపోవడంతో సందేహాలు వ్యక్తమవుతున్నాయి.


ప్రస్తుత వాటితో సంబంధం లేకుండా..

జిల్లాలో పలువురు ప్రస్తుత బదిలీలతో సంబంధం లేకుండా బదిలీ అయ్యారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. వీటిని వ్యతిరేకిస్తూ బదిలీల ప్రక్రియ కోసం ఏర్పాటు చేసిన డైట్ కళాశాల క్యాంపు వద్ద పలు సంఘాల నాయకులు పైరవీ బదిలీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం నిరసన తెలిపారు. స్పౌజ్‌తో సంబంధం లేకుండా కేవలం ప్రభుత్వం నేరుగా వచ్చిన బదిలీలు జిల్లాలో మొత్తం ఐదు జరిగినట్లు తెలుస్తుంది. ఇందులో ఒక ఉపాధ్యాయురాలు జిల్లా నుంచి ఇంటర్ డిస్ట్రిక్ట్ రంగారెడ్డి, మరో ఉపాధ్యాయురాలు మేడ్చల్ మల్కాజ్‌గిరికి బదిలీ అయ్యారు. అలాగే మరో ఉపాధ్యాయురాలు దేవరకద్ర మండలం నుంచి మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోకి రాగా.. బాలానగర్ నుంచి మరో ఉపాధ్యాయురాలు బదిలీకి సిద్ధంగా ఉంది. అలాగే జడ్చర్ల మండలంలోనూ ఓ బదిలీ జరిగినట్లు తెలుస్తుంది. ఈ విషయం సంఘాల దృష్టికి రావడంతో ఈ బదిలీలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి.

స్పౌజ్‌లోనూ అదే తీరు..

జిల్లావ్యాప్తంగా 61 మంది ఉపాధ్యాయులకు స్పౌజ్ కేటగిరీలో బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి స్పౌజ్ బదిలీలకు సంబంధించి 50కిపైగా జాయినింగ్ ఆర్డర్లను విద్యాశాఖ అధికారులు ఇచ్చారు. ఈ క్రమంలో వీరికి పలు పాఠశాలలు కేటాయింపుల విషయంలో అన్యాయం జరిగినట్లు తెలుస్తుంది. రాజకీయ పలుకుబడి ఉన్నవారు తమకు కావాల్సిన స్థానాలకు నేరుగా బదిలీ చేసినట్లు పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. కానీ, దీనిపై బదిలీ అయిన ఉపాధ్యాయులు బయటికి చెప్పేందుకు జంకుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే..



జిల్లావ్యాప్తంగా మొత్తం 61 స్పౌజ్‌కు సంబంధించిన బదిలీలు జరిగాయి. ఇందులో 50కిపైగా ఆర్డర్లు శుక్రవారం రాత్రి ఇచ్చాం. వీటితోపాటు మరో 4 బదిలీలు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు చేశాం. ఇప్పటికే సీనియార్టీ జాబితా ప్రకటించినందున షెడ్యూల్ ప్రకారం బదిలీలు జరుగుతాయి.

– యాదయ్య, డీఈఓ, మహబూబ్‌నగర్

వాటి రద్దు చేయాలి

ప్రభుత్వం ఒకవైపు పారదర్శకంగా బదిలీలను చేపడతామని చెబుతూనే మరోవైపు అక్రమంగా బదిలీలకు ఉత్తర్వులు ఇవ్వడం చాలా దారుణమైన అంశం. 317లోనే అనేక మందికి అన్యాయం జరిగింది. ప్రస్తుత బదిలీల్లో అలాంటి పరిస్థితి నెలకొంటే సాధారణ ఉపాధ్యాయులకు న్యాయం జరిగేదెన్నడు. వెంటనే వాటిని రద్దు చేయాలి.

– రవికుమార్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

పారదర్శకత లోపించింది..

ప్రభుత్వం చేపట్టిన బదిలీల ప్రక్రియ ప్రారంభం కాక ముందే పలువురు నేరుగా ప్రభుత్వం నుంచి ఆర్డర్లు తీసుకురావడంతో పారదర్శకత లోపించింది. వెంటనే అధికారులు, ప్రభుత్వం స్పందించి అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలి. అందరికీ న్యాయం జరిగే విధంగా చూడాలి.

– వెంకటేశ్వర్లు, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి

రికార్డుల్లో నేరాల వివరాలు నమోదు చేయాలి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో చోటుచేసుకునే నేరాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని ఎస్పీ నర్సింహా అన్నారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం ఎస్‌బీ, డీసీఆర్‌బీ, సీసీఎస్, ఎఫ్‌పీబీ, ఐటీ కోర్ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాఖలో పనిచేసే ప్రతిఒక్కరు సమయపాలన పాటించాలన్నారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న అన్నిరకాల కేసుల పరిస్థితిని తెలుసుకుని విచారణ అధికారులకు తెలియజెప్పాలన్నారు. రోడ్డు ప్రమాదాల కట్టడి కోసం ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే జాతర సీజన్లలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రత కల్పించాలన్నారు. జాబ్, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలు నిరంతరం గస్తీ చేస్తుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఆదినారాయణ, వెంకటరమణారెడ్డి, లక్ష్మణ్, సీఐలు పాల్గొన్నారు.

- డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌ను శనివారం డీఐజీ కార్యాలయంలో ఎస్పీ నర్సింహ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇద్దరు అధికారులు జిల్లాకు కొత్తగా వచ్చిన క్రమంలో జిల్లా పరిస్థితులు, శాంతిభద్రతలపై సమీక్షించారు.
- జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నర్సింహను జిల్లా జైలు సూపరింటెండెంట్ వెంకటేశం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు కొత్తగా వచ్చిన నేపథ్యంలో జైలు సూపరింటెండెంట్ ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



డీఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ నర్సింహా

ప్రతిరోజు ఫిర్యాదుల స్వీకరణ

జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని ఎస్పీ నర్సింహా ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా సమస్య ఉన్నవారు మొదట తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లకు వెళ్లాలని, అక్కడ న్యాయం జరగకపోతే సీఐ కార్యాలయాన్ని, ఆ తర్వాత డీఎస్పీ కార్యాలయానికి వెళ్లాలని, అక్కడ కూడా న్యాయం జరగకపోతే ఎస్పీ కార్యాలయానికి రావాలని సూచించారు.



శోభాయమానం లక్ష్మీచెన్నకేశవుడి రథోత్సవం

జడ్చర్ల మండలంలోని గంగాపురంలో శనివారం రాత్రి నిర్వహించిన చెన్నకేశవస్వామి రథోత్సవం శోభాయమానంగా సాగింది. రథం ఊరేగింపులో భక్తుల గోవిందనామ స్మరణతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. - జడ్చర్ల టౌన్

- వివరాలు 10లో

క్లుప్తంగా

కేఎల్ఐ కాల్వలో పడి యువకుడి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కేఎల్ఐ కాల్వలో పడి యువకుడు మృతిచెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని జ్ఞాన సరస్వతి దేవాలయం సమీపంలోని కేఎల్ఐ కాల్వ వద్ద శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వనపర్తి జిల్లా మదనాపురానికి చెందిన చంద్రుడు(23), ఈ నెల 26న శ్రీశైలం వెళ్లి శనివారం తిరిగి వస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని జ్ఞాన సరస్వతి దేవాలయం సమీపంలోని కేఎల్ఐ కాల్వ వద్ద కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా.. ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతుడి తల్లి శేషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

చేపల వలలో చిక్కుకుని వ్యక్తి..

నవాబుపేట: చేపల వేటకు వెళ్లి వల చిక్కుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని అమ్మపూర్‌లో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నీరటి పెంటయ్య(48) శుక్రవారం గ్రామ సమీపంలోని చెరువులో చేపల వేటకు వల తీసుకెళ్లాడు. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. వెళ్లేముందు ఇంట్లో చెప్పకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికారు. కాగా శనివారం చెరువులో పెంటయ్య మృతదేహం తేలింది. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించటంతో వారు వచ్చి మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి చేతికి, కాలికి చేపల వల చుట్టుకుని ఉంది. భార్య సరిత ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పురుషోత్తం తెలియజేశారు.

అద్దె షాపులో యువకుడి ఆత్మహత్య


కురుమూర్తి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తిగత కారణాలతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన, నాగర్‌కర్నూల్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బిజినేపల్లి మండలం పోలేపల్లికి చెందిన కురుమూర్తి (26) జిల్లా కేంద్రంలో షాపును అద్దెకు తీసుకొని వీడియో మిక్సింగ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతడు పోలేపల్లి గ్రామం నుంచి శనివారం ఉదయం షాపుకు వచ్చి అందులోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యాహ్నం గమనించిన స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. తన చావుకు ఎవరూ కారణంకాదని కురుమూర్తి సూసైడ్ లెటర్ రాశాడని, తండ్రి శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వెల్లడించారు.

రామన్‌పాడుకు 350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం పూర్తి నీటిమట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 200 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. దీంతో ప్రాజెక్టులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 250 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి



మాగనూర్(మక్తల్): మక్తల్ మండలంలోని గడ్డంపల్లికి చెందిన శ్రీనివాసులు అనే రైతుకు చెందిన రెండు గేదెలు శనివారం మేత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతిచెందాయి. నిరుపేద రైతును ఆదుకోవాలని సర్పంచ్ త్రివేణి జ్ఞానేశ్వర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గేదెల విలువ సమారుగా రూ.లక్షా 60వేల వరకు ఉంటుందని తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి


వరదమ్మ (ఫైల్)

కోడేరు: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు పట్టాభి వరదమ్మ(105) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. ఐదేళ్ల క్రితం ఆమె వందేళ్ల పుట్టిన రోజు వేడుకలను కుమారులు, మనుమలు, మనుమరాళ్లు ఘనంగా జరిపారు. 105 ఏళ్లు అయినప్పటికీ తన పని తాను చేసుకునేందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

సమష్టిగా బ్రహ్మోత్సవాలు నిర్వహిద్దాం

- మన్యంకొండ జాతరకు నియమించే అధికారులు, సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు జారీచేయాలి
- అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. శనివారం మన్యంకొండ అలివేలుమంగ ఆలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా, మండల స్థాయి అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాక ఆయా శాఖల ద్వారా బ్రహ్మోత్సవాల విధులకు నియమించే ఉద్యోగులకు సంబంధించి ఫోన్ నంబర్లతో సహా ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని చెప్పారు. ప్రతి శాఖ నుంచి ఒకరిని కంట్రోల్ రూంలో విధులు నిర్వహించేలా చూడాలన్నారు. వచ్చేనెల 5, 6, 7 తేదీలతోపాటు 11, 18 తేదీల్లో ముఖ్యమైన రోజులు ఉన్నందున తగినంత బందోబస్తు కల్పించాలని పోలీసు శాఖను కోరారు. ఆర్అండ్‌బీ ద్వారా బారికేడింగ్ ఏర్పాటు చేయాలని, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ తరపున రెండు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా తగినంత శానిటేషన్ సిబ్బందిని ఏర్పాటు చేసి పారిశుద్ధ్య చర్యల్లో ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలని డీపీఓకు చెప్పారు. ఏఎస్పీ రాములు మాట్లాడుతూ పోలీస్ శాఖ తరఫున 471 మంది పోలీసులను బందోబస్తు విధులు నియమించినట్లు తెలిపారు. కంట్రోల్ రూంతోపాటు వాకిటాకీలు అందుబాటులో ఉంచామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేయాలని, ఆర్టీసీ ద్వారా బస్సులను నడపాలని, బ్రహ్మోత్సవాలను సమష్టిగా విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ సుధాశ్రీ, ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, డీపీఓ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్ఓ కృష్ణ, ఆర్డీఓ అనిల్‌కుమార్, డీఎస్పీ మహేష్, సీఐ రాజేశ్వర్‌గౌడ్, డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్టీసీ ఆర్ఎం శ్రీదేవి, తహసీల్దార్ పాండు, ఎంపీడీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయంలో కమిషనర్ పూజలు


మ్యూజియంలో ఆలయ చరిత్ర కమిషనర్‌కు వివరిస్తున్న పూజారులు

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండల కేంద్రంలోని రంగనాథస్వామి ఆలయంలో శనివారం రాష్ట్ర పౌర సరఫరాలు, దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని పరిసరాలు, మ్యూజియంలో ఉన్న వెండి రథాలను, చిత్రపటాలను చూపిస్తూ ఆలయ చరిత్రను పూజరులు వివరించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్ అబ్రహంలింకన్, అధికారులు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

మిడ్జిల్: మండలంలోని వాడ్యాల్‌కు చెందిన కొమ్ము ప్రశాంత్‌పై పాత కక్షలతో అదే గ్రామానికి చెందిన గడ్డల కృష్ణయ్య గురువారం మిడ్జిల్ బస్టాండ్‌లో కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. పసిగట్టిన ప్రశాంత్ తప్పించుకొని శుక్రవారం మిడ్జిల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం హత్యాయత్నానికి పాల్పడిన గడ్డల కృష్ణయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ తెలియజేశారు.

విషపురుగు కాటుకు చిన్నారి బలి


లోకేష్ (ఫైల్)

మదనాపురం: అమ్మ ఒడిలో పాలు తాగి, ఇంట్లో నుంచి గడప దాటి వెళ్లి ఆడుకుంటున్న బాలుడు కాసేపటికి అమ్మా.. అంటూ గుక్కి పట్టి ఏడ్చి స్పృహ కోల్పోయాడు. క్షణాల్లో గమనించిన తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించే లోపే ప్రాణాలు విడిచిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మదనాపురం మండలంలోని నరసింగాపురానికి చెందిన విష్ణు, పప్పీ దంపతుల రెండో కుమారుడు లోకేష్(4) శుక్రవారం సాయంత్రం తల్లిఒడిలో పాలు తాగి, గడప దాటి బయట ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో పక్కనే నిల్వ ఉంచిన సిమెంట్ సంచుల్లో నుంచి విషపురుగు వచ్చి కాటు వేసింది. దీంతో తల్లడిల్లిన ఆ చిన్నారి అమ్మా అంటూ గుక్క పట్టి ఏడ్చాడు. తల్లిదండ్రులు గమనించి క్షణాల్లో చికిత్స నిమిత్తం కొత్తకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు వనపర్తికి తీసుకెళ్లారు. అప్పటికే నోటిలో నుంచి నురుగ వచ్చి చిన్నారి మృత్యువాత పడ్డాడు. దీంతో వారి కుటుంబంలో కన్నీటి రోదనలు మిన్నంటాయి. బంధువులు కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

ప్రాణంతీసిన అతివేగం

హన్వాడ: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృత్యువాత పడిన సంఘటన శనివారం మండల పరిధిలోని పల్లెమోనికాలని శివారు తాండూర్ ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. మహమ్మదాబాద్ మండలం వెంకట్‌రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దొమ్మరి ఆంజనేయులు(శివస్వామి), కొడి శ్రీకాంత్ స్నేహితులు. ఉదయం గ్రామంలోని శివాలయంలో పూజ ఉందని పూజ నిమిత్తం పూలు, ఇతర సామగ్రి కొనుగోలు నిమిత్తం బైక్‌పై జిల్లా కేంద్రానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పల్లెమోనికాలనీ సమీపంలో ప్రధాన రహదారిపై ముందుగా వెళ్తున్న బస్సులను ఓవర్‌టేక్ చేస్తూ దొమ్మరి ఆంజనేయులు అతివేగంగా బైక్‌ను నడిపాడు. ఈక్రమంలో ముందుగా వెళ్తున్న రెండు బస్సుల్లో పరిగి డిపోకు చెందిన బస్సు సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల బైక్‌పై యువకులు సైతం సడన్ బ్రేక్ వేశారు. ఈ వేగంలో వెనకాల కూర్చున్న కొడి శ్రీకాంత్ (20) పట్టుకోల్పోయి కిందపడడంతో తలపగిలి మెదడు బయటికి వచ్చి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. అలాగే దొమ్మరి ఆంజనేయులుకు స్వల్పగాయాలయ్యాయి. కాగా మృతుడు తండ్రి కొడి లాలయ్య ఫిర్యాదు మేరకు దొమ్మరి ఆంజనేయులు, బస్సుడ్రైవర్ మడుగు ఆంజనేయులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవినాయక్ పేర్కొన్నారు.

12మంది ట్రాన్స్‌జెండర్లపై కేసు నమోదు


కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు, అధికారులు

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్–రాయచూర్ ప్రధాన రోడ్డుపై జరిగిన ఘటనపై శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో 12మంది ట్రాన్స్‌జెండర్లపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. వీరిపై న్యూసెన్స్, ప్రజలకు ఇబ్బందులు కల్గించే అంశం, రోడ్డును బ్లాక్ చేసిన విషయాలను పరిగణలోకి తీసుకుని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మొత్తం 12మందికి సఖి కేంద్రం కో–ఆర్డినేటర్ మంజుల, ఇతర సిబ్బంది సాయంతో పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగిందన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలకు పాల్పడకుండా ఉండటానికి కేసులు నమోదైన 12మంది ట్రాన్స్‌జెండర్లను సోమవారం తహసీల్దార్ ఎదుట హాజరుపరచి ఒక్కొక్కరికి రూ.4లక్షల చొప్పున లేదా ఆరు నెలల జైలు శిక్ష కింద బైండోవర్ చేస్తామన్నారు. మళ్లీ ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

వన్యప్రాణిని వేటాడిన వ్యక్తికి రిమాండ్


నిందితుడు వెంకటయ్య, ద్విచక్ర వాహనాలతో అటవీశాఖ అధికారులు

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో వన్యప్రాణి(కణితి)ని వేటాడి చంపిన సంఘటనలో వ్యక్తిపై కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు పంపారు. అమ్రాబాద్ ఫారెస్టు రేంజ్ అధికారి ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మాచారం ఫారెస్టు రేంజ్ పరిధిలోని జంగంరెడ్డిపల్లి సమీప అటవీ ప్రాంతంలో దాసరి వెంకటయ్య, దాసరి శివ, దాసరి బాలు అనే ముగ్గురు వ్యక్తులు ఉచ్చుతో కణితిని వేటాడినట్లు తెలిపారు. ఈక్రమంలో కణితి మాంసం విక్రయించేందుకు అమ్రాబాద్‌కు తీసుకువస్తుండగా సమాచారం అందడంతో వల పన్ని దాసరి వెంకటయ్యను పట్టుకున్నట్లు తెలిపారు. మిగతా ఇద్దరు తప్పించుకున్నారని అన్నారు. వీరివద్ద నుంచి కొంత మాంసం, 3 కత్తులు, ఉచ్చులు, సెల్‌ఫోన్, ఒక బ్యాటరీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసి కల్వకుర్తి జైలుకు పంపామని తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ మధుసూదన్‌గౌడ్, ఎఫ్‌బీఓ హన్మంతు, శ్రీకాంత్, వాచర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో..

ఎర్రవల్లి చౌరస్తా: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఇటిక్యాల ఎస్ఐ గోకారి కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన బీసన్న(50)కు రెండు చేతులు లేకపోవడంతో భిక్షాటన చేసుకుంటూ ఎర్రవల్లి పరిసర ప్రాంతంలో ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి జాతీయ రహదారిపై కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్లే రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడిపై దాడి: ఐదుగురిపై కేసు నమోదు


గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తిరుమలేష్

మల్దకల్: అకారణంగా ఇంట్లోకి చొరబడి ఓ యువకుడిపై దాడి చేసిన సంఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పావనంపల్లికి చెందిన తిరుమలేష్ గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఫొటోలు తీసి, వాట్సప్‌లో షేర్ చేశాడు. సర్పంచ్ గ్రామంలో ఉండటం లేదు, సమస్యలను పట్టించుకోవడం లేదంటూ వాట్సప్‌లో పెట్టిన మెసేజ్ వైరల్‌గా మారింది. శుక్రవారం రాత్రి సర్పంచ్ భర్త జయరాములుతో పాటుగా పరశురాం, భాస్కర్, కుమార్, వీరన్న గ్రామానికి చేరుకుని, తిరుమలేష్ ఇంట్లోకి చొరబడి దాడి చేసినట్లు తెలిపారు. గాయపడిన తిరుమలేష్‌ను గద్వాల ఆస్పత్రికి తరలించి, దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

జాతీయస్థాయిలో మొదటి ర్యాంకు


కార్తీక

నారాయణపేట రూరల్: జాతీయ స్థాయిలో నారాయణపేట విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బెంగుళూర్‌లోని నేషనల్ టీచర్ కౌన్సిల్ (ఎన్‌టీఏసీఈ) ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్‌లో జరిగిన నేషనల్ లేవల్ సైన్స్ ఒలంపియాడ్ టెస్ట్ ఫలితాలు శనివారం సాయంత్రం విడుదల చేశారు. పట్టణంలోని రవితేజ స్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి కార్తీక 50మార్కులకు గాను 46 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు పొందింది. ఇదే పాఠశాలకు చెందిన మరో 9మంది గోల్డ్‌మెడల్‌కు, ముగ్గురు సిల్వర్ మెడల్‌కు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల కరస్పాండెంట్ విశాల యాదయ్యశెట్టి, ప్రిన్సిపాల్ వినోద్ అభినందించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఊర్కొండ: ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. పోలీసులు భద్రత ఏర్పాట్లు చేశారు.

వచ్చేనెల 11న జాతీయ లోక్ అదాలత్

- మహబూబ్‌నగర్ జడ్జి ప్రేమావతి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి ప్రేమావతి

పాలమూరు: జిల్లాలో వచ్చేనెల 11న జిల్లా కోర్టుతో పాటు జడ్చర్ల కోర్టులో జాతీయ లోక్ అదాలత్ చేపడుతున్నట్లు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రేమావతి వెల్లడించారు. జిల్లా కోర్టులో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా సుమారు 10 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పేదలు కోర్టుకు తిరగలేక ఇబ్బందులు పడుతున్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుని లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ అయ్యే అవకాశాన్ని కల్పించినట్లు చెప్పారు. జిల్లా పోలీస్ శాఖ పరిధిలో రాజీ చేసుకోవడానికి అవకాశం ఉన్న కేసులను గుర్తించి, పరిష్కారం కోసం కక్షిదారుల్లో అవగాహన కలిగించాలన్నారు. రాజీ అయ్యే కేసుల్లో ప్రధానంగా క్రిమినల్, సివిల్, ప్రిలిటీగేషన్, ఇన్సూరెన్స్, బ్యాంకు, ఎలక్ట్రిసిటీ, భూతగాదాలు, ఎక్సైజ్, మోటార్ వెహికల్, చిట్‌ఫండ్, చెక్ బౌన్స్ కేసుల్లో రాజీ అయ్యే అవకాశం ఉందన్నారు. రాజీ అయ్యే కక్షిదారులు సదరు న్యాయవాదులతో కలిసి కోర్టులకు నేరుగా హాజరుకావాలన్నారు. రాజీ అయ్యే కేసుల్లో ప్రధానంగా డ్రంకెన్ డ్రైవ్, ఈ–పెట్టి కేసులు, ఎంవీఐ యాక్టు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కేసులు పరిష్కరిస్తామన్నారు. జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి రాజీ చేసుకోవడానికి అవకాశం ఉన్న కేసుల వివరాలు ఇవ్వడంతో పాటు కక్షిదారులు కోర్టుకు వచ్చేవిధంగా చూడాలన్నారు.

పేదలకు న్యాయం అందేలా కృషిచేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పేదలకు న్యాయం అందేలా క్షేత్రస్థాయిలో ప్యారాలీగల్ వలంటీర్లు కృషిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి ప్రేమావతి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం జిల్లా కార్యాలయంలో సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అధ్యక్షతన ఏర్పాటు చేసిన పీఎల్‌వీల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా జడ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయ అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్యారా లీగల్ వలంటీర్ల సేవలను మరింత విస్తృతం చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పేదలకు న్యాయ సహాయం అందించే విధానాల్లో ఎన్నో మార్పులు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరీ నిర్మూలన చట్టం వంటి అంశాలపై పీఎల్‌వీలకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు విజయరాజు మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరీ నిర్మూలనకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్యారాలీగల్ వలంటీర్లతోపాటు వివిధ కళాశాలల విద్యార్థులు, జేజేబీ సభ్యులు, న్యాయవాదులు, పోలీసు, కార్మిక శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
■ రాజాపూర్ @ NH-44 దగ్గర 0% ఇంట్రెస్ట్ తో 30 నెలు EMI తో అన్ని డేవలప్‌మెంట్స్ తో 147 గజాల MUDA=(HMDA) లేఔట్లో ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్ కు సంప్ర. ఫోన్ : 9849669027.

SERVICES
HEALTH CARE
ORTHOPEDIC SURGEON
■ డా॥ యస్.రవితేజ రెడ్డి, M.S., (Ortho) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228666, 83412 98888

GYNECOLOGY
■ కార్తీక్ హాస్పిటల్, నంధ్యాల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, అన్ని రకాల స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి, షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. డా॥ యస్.చంద్రశేఖర్, M.D. ఫిజిషియన్, డా॥ పార్వతి దేవి, M.D., DGO స్త్రీ వ్యాధి ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్: 10-8PM, 08518-226162

RHEUMATOLOGIST
■ కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో మొట్టమొదటి ఎక్రైక కీళ్లవ్యాధి నిపుణులు. డాక్టర్. ఎ.సృజన, M.D., DM., NIMS (Hyd) ప్రత్యేకతలు : చేతులు, మణికట్టు, కీళ్లలో నొప్పి, వాపు రావడం, ప్రొద్దున్నే లేవగానే నడవలేకపోవడం పాదాల వాపులు రావడం అరికాళ్లు మంటలు, వెన్నుపూస వంగిపోవడం, నోటిలో పుండ్లు రావడం, చిన్నపిల్లల కీళ్లవ్యాధులకు చూడబడును. క్లినిక్ జీవన్ రాయలసీమ సూపర్ స్పెషాలిటీ, గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా, కలెక్టర్ ఆఫీస్, కర్నూలు. 08518-255502, సెల్ : 81064 60012.

WANTED
■ విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోర్ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 డ్రైవింగ్/భోజనం/వసతి ఫ్రీ ☎ 90300 44646.
■ మహారాష్ట్ర మరియు కర్ణాటక నందు పనిచేయుటకు అనుభవం ఉన్న సైట్ సూపర్‌వైజర్స్, డ్రైవర్స్ కావలెను. PVR Projects Ltd Hyd. ఫోన్: 040-2384080, 23338080. E-Mail: adm.vineela@gmail.com
■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573888520, 9059838520
■ హైదరాబాద్, వెస్ట్ మారేడుపల్లిలో డాక్టరమ్మ గారి ఇంటిలో వంట చేయుటకు ఆడవారు కావలెను. వయస్సు : 45 సం॥ల పైన. వివరాలకు సంప్ర. సెల్ : 98484 25642.
■ ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ J.Group కంపెనీ హైదరాబాద్‌లో పని చేయుటకు ఉత్సాహవంతమైన యువకులు కావలెను. Age: 18 to 30k, సాలరీ: 14,000 to 40,000/– + కమీషన్. Qualification: 10th, ఇంటర్, డిగ్రీ. ఫోన్: 9666888883.



ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
మహబూబ్‌నగర్ : 9010234478
9010522215
9705135557
9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్లేషణ చేసుకుని స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు చెప్పే లేదా క్లెయిమ్ చేసే వాటిలో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ కౌంటర్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు. - సాక్షి మేనేజ్‌మెంట్

క్లుప్తంగా...

నేను మూర్ఖుడిని

- మా వారిపై కేసులు పెట్టిన అధికారులను వదిలిపెట్టం
- యువగళం పాదయాత్రలో నారా లోకేశ్



శాంతిపురం (చిత్తూరు జిల్లా): తాను మూర్ఖుడినని, తమ వారిపై కేసులు పెట్టిన అధికారులను వదిలిపెట్టేది లేదని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. చక్రవడ్డీతో కలిపి రుణం తీర్చుకుంటామని అన్నారు. భయం తమ బ్లడ్‌లోనే లేదని అన్నారు. కేసులకు భయపడకుండా పోరాటం చేయాలని పార్టీ కార్యకర్తలకు చెప్పారు. లోకేశ్ యువగళం పాదయాత్ర శనివారం ఉదయం గుడుపల్లె మండలంలోని పీఈఎస్ ఆస్పత్రి వద్ద ప్రారంభమై సాయంత్రం శాంతిపురం మండలంలోని టి.కొత్తూరు క్రాసు వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఆయన టీడీపీకి చెందిన కురుబ కుల నాయకులు, బీసీ నాయకుల సమావేశాల్లో, పలు చోట్ల రోడ్లపై నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. తమ హయాంలో కుప్పంలో పరిశ్రమలు తెచ్చామని, 25 వేల మందికి ఉపాధి కల్పించామని చెప్పారు.

వాయుగుండంగా మారనున్న అల్పపీడనం



సాక్షి, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో తూర్పు భూమధ్య రేఖను ఆనుకుని ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కూడా విస్తరించి ఉంది. ఇది క్రమంగా పశ్చిమ వాయవ్య దిశగా పయనించి ఆదివారం తీవ్ర అల్పపీడనంగా మారనుంది. అనంతరం అదే దిశలో కదులుతూ సోమవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) శనివారం రాత్రి నివేదికలో వెల్లడించింది. వాయుగుండం నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించి ఫిబ్రవరి 1న శ్రీలంక తీరానికి చేరుకుంటుందని తెలిపింది. దీని ప్రభావంతో ఈ నెల 30వ తేదీ నుంచి దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వివరించింది.



వైభవంగా రథ సప్తమి సూర్య జయంతిని పురస్కరించుకుని తిరుమలలో శనివారం రథసప్తమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీమలయప్పస్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.

విచారణ పారదర్శకంగా జరగాలని కోరాం

కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి వెల్లడి

- వీడియో, ఆడియో రికార్డింగ్ కోసం పట్టుబట్టిన న్యాయవాది
- సాక్షిగా మాత్రమే విచారిస్తున్నామన్న సీబీఐ అధికారులు

సాక్షి, హైదరాబాద్, అమరావతి: ఏపీ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఒక సాక్షిగా శనివారం సీబీఐ విచారణకు హాజరయ్యారు. విచారణ పారదర్శకంగా జరగాలని కోరారు. సీబీఐ అధికారులు సీఆర్‌పీసీ సెక్షన్ 160 (సాక్షిగా పిలవడం) కింద జారీ చేసిన నోటీసులను గౌరవిస్తూ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆయన కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వచ్చారు. ఆయనతో పాటు న్యాయవాదులు తప్పెట నాగార్జునరెడ్డి, నాగిరెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కూడా ఉన్నారు. రాత్రి 7.30 గంటల వరకు అవినాశ్‌రెడ్డి నుంచి సీబీఐ అధికారులు పలు అంశాలపై సమాచారాన్ని సేకరించారు. ఇదే సమయంలో అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది తప్పెట నాగార్జునరెడ్డి సీబీఐ అధికారులను కలిశారు. అవినాశ్‌రెడ్డి వాంగ్మూలాల నమోదు ప్రక్రియను మొత్తం వీడియో, ఆడియో రికార్డింగ్ చేయాలని కోరారు. ఈ కేసుకున్న సున్నితత్వం, వీడియో ఆడియో రికార్డింగ్ చేయాల్సిన అవసరాన్ని, ఈ విషయంలో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను ఆయన సీబీఐ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే ఈ కేసులో మీడియా ట్రయల్ నిర్వహిస్తోందని, అందువల్ల వాంగ్మూల నమోదు ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలని గట్టిగా ఆయన పట్టుబట్టారు. ఓ వర్గం మీడియా అవినాశ్‌రెడ్డిను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కథనాలు రాస్తోందని, అందువల్ల నిష్పాక్షిక దర్యాప్తులో భాగంగా వీడియో ఆడియో రికార్డింగ్ చేయడం తప్పనిసరి అని చెప్పారు. అవినాశ్‌రెడ్డిని ఓ సాక్షిగా మాత్రమే విచారిస్తున్నామని, ఆయన పట్ల ఏ రకంగానూ అమర్యాదగా, అనుచితంగా వ్యవహరించడం లేదని న్యాయవాదులకు సీబీఐ అధికారులు చెప్పినట్లు తెలిసింది. వాంగ్మూలం నమోదు అనంతరం అవినాశ్‌రెడ్డి సీబీఐ కార్యాలయం నుంచి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. 'సీబీఐ దర్యాప్తు అధికారి అడిగిన ప్రశ్నలకు నాకు తెలిసిన మేర సమాధానాలు చెప్పాను. మళ్లీ అవసరమైతే పిలుస్తామని సీబీఐ అధికారులు చెప్పారు. వారు పిలిస్తే మళ్లీ విచారణకు హాజరవుతా. వారికి సహకరిస్తా. వారి సందేహాలను నివృత్తి చేస్తా'అని తెలిపారు. విచారణ పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతోనే న్యాయవాదిని అనుమతించాలని కోరామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన విచారణలో కొద్ది రోజులుగా ఓ వర్గం మీడియా విపరీతంగా వక్రీకరణలు చేస్తోందన్నారు. వాస్తవాలను, వార్తలను వక్రీకరించి దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా, వ్యక్తిత్వ హననం చేసే ప్రయత్నం చేస్తోందని చెప్పారు. ఇకపై ఇలాంటివి జరగకూడదనే వీడియో, ఆడియో రికార్డింగ్‌తో పాటు న్యాయవాదిని అనుమతించాలని కోరామన్నారు.

'వీరయ్య' సక్సెస్‌మీట్‌లో తొక్కిసలాట.. లాఠీ చార్జ్

హనుమకొండలో వాల్తేరు వీరయ్య చిత్రం సక్సెస్ మీట్

- చిరంజీవిని చూసేందుకు దూసుకొచ్చిన అభిమానులు
- ప్రధాన గేటు వద్ద తొక్కిసలాట.. పలువురికి గాయాలు

వరంగల్ క్రైం: వాల్తేరు వీరయ్య చిత్ర యూనిట్ శనివారం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 'వాల్తేరు వీరయ్య విజయ విహారం'పేరిట నిర్వహించిన సక్సెస్ మీట్‌లో గందరగోళం చోటుచేసుకుంది. చిరంజీవిని చూసేందుకు అభిమానులు ఒక్కసారిగా తోసుకుని రావడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. వేదిక ప్రధాన గేటు వద్ద జరిగిన తొక్కిసలాటలో పలువురికి గాయాలయ్యాయి. అభిమానుల తాకిడిని చిత్ర యూనిట్‌తోపాటు పోలీసశాఖ గుర్తించకపోవడం, అభిమానుల సంఖ్యకు తగ్గట్లు ఏర్పాట్లు చేయకపోవడంపై అటు అభిమానులు, ఇటు నగరవాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బందోబస్తు ఫెయిల్యూర్ అయ్యిందన్న విమర్శలు పెద్దఎత్తున వినిపించాయి. శనివారం సాయంత్రం ఆరు గంటల తరువాత సినిమా సక్సెస్ మీట్ ప్రారంభమైంది. మెగాస్టార్ చిరంజీవి, హీరో రాంచరణ్ తదితరులు హాజరయ్యారు. ప్రధాన గేటును తెరిచిన సమయంలో ప్రజలు, అభిమానులు తమ అభిమాన హీరోలను చూసేందుకు ఒక్కసారిగా తోసుకుని రావడంతో కొంతమంది కిందపడటం.. వారిని తొక్కుకుంటూ మిగతా వారు గ్రౌండ్ లోపలికి వెళ్లడంతో పలువురికి గాయాలయ్యాయి. అయితే తొక్కిసలాటలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ఈ సమయంలో కొందరు పోలీసులు సైతం కిందపడ్డారు.

ఏర్పాట్లలో నిర్లక్ష్యం వల్లే...

కళాశాల గ్రౌండ్ విశాలంగా ఉన్నప్పటికి చిత్ర యూనిట్ అందులో బారికేడ్లు ఏర్పాటు చేసింది. దీనికి తోడు అధికసంఖ్యలో జారీ చేసిన ఎంట్రీ పాస్‌ల వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయి. మైదానంలోకి ప్రవేశించిన అభిమానులకు పాస్‌ల ప్రకారం ఆయా గ్యాలరీలకు వెళ్లేందుకు ఎలాంటి బారికేడ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో అన్ని పాస్‌ల వారు ఇష్టారాజ్యంగా లోపలికి చొరబడేందుకు ప్రయత్నం చేయడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. దీనికి తోడు ఏర్పాటు చేసిన బారికేడ్లు కూడా అభిమానుల తోపుడుకు కిందపడ్డాయి. దీంతో ఒక గ్యాలరీ నుంచి మరో గ్యాలరీకి అభిమానులు చొరబడ్డారు. బందోబస్తు ప్రణాళికలో పోలీసులు ఫెయిల్యూర్ అయ్యారనే విమర్శలు వెల్లువెత్తాయి.

అత్యంత విషమంగా తారకరత్న ఆరోగ్యం

- నారాయణ హృదయాలయలో ఎక్మో ద్వారా చికిత్స
- పలువురు కుటుంబ సభ్యుల పరామర్శ

సాక్షి బెంగళూరు: సినీ నటుడు నందమూరి తారకరత్న ఆరోగ్యం అత్యంత విషమంగా ఉందని బెంగళూరులోని నారాయణ హృదయాలయ వైద్యులు తెలిపారు. ప్రస్తుతం ఆయనకు నారాయణ హృదయాలయ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. తారకరత్న గుండె పని తీరు సరిగా లేకపోవడంతో ఎక్మో ద్వారా చికిత్స అందిస్తున్నారు. మరో 48 గంటలు గడిస్తేనే కానీ ఏ విషయం చెప్పలేమని వైద్యులు చెబుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కుప్పంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పాదయాత్రలో పాల్గొన్న తారకరత్నకు గుండెపోటు వచ్చిన సంగతి తెలిసిందే. వైద్యుల సూచన మేరకు మరింత మెరుగైన చికిత్స కోసం ఆయన్ని శుక్రవారం అర్ధరాత్రి బెంగళూరు బొమ్మసంద్రలోని నారాయణ హెల్త్ సిటీలో చేర్పించారు. ఆయనకు ఇంట్రా ఆయోర్టిక్ పంప్, వ్యాసో ఆక్టివ్ సహాయంతో చికిత్స ఇస్తున్నట్లు వైద్యులు తెలిపారు. బెలూన్ యాంజియోప్లాస్టీ ద్వారా రక్తాన్ని పంపింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక వైద్య బృందాలు ఆయనకు చికిత్స అందిస్తున్నాయన్నారు.

చంద్రబాబు, ఇతర కుటుంబ సభ్యుల పరామర్శ

తారకరత్నను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఇతర కుటుంబ సభ్యులు, పలువురు టీడీపీ ప్రముఖులు శనివారం సాయంత్రం ఆస్పత్రిలో పరామర్శించారు. దగ్గుబాటి పురందేశ్వరి, దివంగత హరికృష్ణ కుమార్తె సుహాసిని, సోదరుడు చైతన్యకృష్ణ, టీడీపీ నేతలు నిమ్మకాయల చిన్నరాజప్ప, పరిటాల శ్రీరామ్, దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు పరామర్శించారు. తారకరత్నకు త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నామని కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. సోమవారం మరోసారి కీలక పరీక్షలు చేస్తారని తెలిపారు.

కోలుకోవడానికి సమయం పడుతుంది : చంద్రబాబు

తారకరత్న ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, కోలుకోవడానికి సమయం పడుతుందని చంద్రబాబు చెప్పారు. ప్రస్తుతం ఐసీయూలో వైద్యుల పర్యవేక్షణలో తారకరత్న ఉన్నారని తెలిపారు. ఆయన త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని అన్నారు.

మీకు ప్రాణభిక్ష పెట్టింది పోలీసులే

అచ్చెన్నాయుడుపై చిత్తూరు జిల్లా పోలీసు సంఘం ధ్వజం

చిత్తూరు రూరల్/కుప్పం(చిత్తూరు జిల్లా)/తిరుపతి మంగళం: టీడీపీ నేత అచ్చెన్నాయుడికి ప్రాణభిక్ష పెట్టింది పోలీసులేనని.. ఆ విశ్వాసం మరిచి ఇప్పుడు అసభ్యకరంగా మాట్లాడుతున్నారని చిత్తూరు జిల్లా పోలీసు యూనియన్ అసోసియేషన్ ధ్వజమెత్తింది. కుప్పంలో శుక్రవారం జరిగిన నారా లోకేశ్ పాదయాత్రలో అచ్చెన్నాయుడు పోలీసులను అసభ్య పదజాలంతో దూషించడం పట్ల పోలీసు సంఘం నేతలు తీవ్రంగా మండిపడ్డారు. శనివారం వారు చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు ఉదయ్ మాట్లాడుతూ.. గతంలో అచ్చెన్నాయుడిని కొందరు చితకబాది పడేసుంటే.. ప్రాణభిక్ష పెట్టింది పోలీసులేనని గుర్తు చేశారు. అచ్చెన్నాయుడు రాజకీయ ఎదుగుదల కోసమే పోలీసులను చులకన చేసి మాట్లాడుతున్నారని, ఇటీవల కాలంలో టీడీపీ నేతలంతా పోలీసులను తిట్టడం ఓ ఫ్యాషన్‌గా మార్చుకున్నారని మండిపడ్డారు. అచ్చెన్నాయుడు పోలీసులకు క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఎస్పీ రిశాంత్‌రెడ్డిని కలిసి.. అచ్చెన్నాయుడుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కాగా, నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో అచ్చెన్నాయుడు పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారని సీఐ శ్రీధర్ వెల్లడించారు.

బీజేపీ, జనసేన కలిసే పోటీ

రాజ్యసభ సభ్యుడు జీవీఎల్

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): వచ్చే ఎన్నికల్లో బీజేపీ, జనసేన రెండు కలిసే పోటీ చేస్తాయని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు స్పష్టం చేశారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీకి బీజేపీనే అసలైన ప్రత్యామ్నాయమన్నారు. వచ్చే మంగళవారం నుంచి ప్రారంభం కానున్న కేంద్ర బడ్జెట్ సమావేశాల ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధి ప్రాజెక్టుల వేగవంతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. వారసత్వ రాజకీయాలకు, కుటుంబ పాలనలకు ఏపీ అడ్డాగా మారిందన్నారు.

మార్మోగిన గోవిందనామస్మరణ

శోభాయమానంగా లక్ష్మీచెన్నకేశవుడి రథోత్సవం

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం కూడళ్లు గోవిందనామస్మరణతో మార్మోగాయి. శనివారం రథసప్తమి పురస్కరించుకుని లక్ష్మీచెన్నకేశవుడి దర్శనం కోసం ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వ్రతమంటపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. తమకు పండిన పంటలను తీసుకువచ్చి కొత్తకుండలలో వంటావార్పు నిర్వహించి దాసంగాలతో నైవేద్యాలు సమర్పించారు. తలనీలాలు సమర్పించి కోనేటిలో స్నానమాచరించారు. గండదీపాలను తలపై పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఈ ఏడాది గంపజాతర నిర్వహిస్తుండటంతో పడమర ప్రాంతం నుంచి భక్తులు తక్కువగా వచ్చారు. ఆదివారం శకటోత్సవం, సెలవుదినం కావటంతో భక్తుల తాకిడి పెరిగే ఆస్కారం ఉంది.



రథం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

శోభాయమానంగా రథోత్సవం

శనివారం రాత్రి నిర్వహించిన రథోత్సవం శోభాయమానంగా సాగింది. రథాన్ని విద్యుద్దీపాలతో అలంకరించి బలిహరణం, హోమం నిర్వహించిన పండితులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై ప్రతిష్ఠించారు. గ్రామ విశ్వబ్రాహ్మణులను మేళతాళాలతో ఇళ్లకు వెళ్లి గుడికి ఆహ్వానించారు. అనంతరం వారు ఆలయంలో, రథానికి పూజలు చేసిన తర్వాత భక్తులు గోవింద, చెన్నకేశవ నామస్మరణల మధ్య రథాన్ని లాగారు. అర్ధరాత్రి దాటాక రథోత్సవం గ్రామ పురవీధులగుండా సాగింది.



క్యూలో వెళ్తున్న భక్తులు

పాలెంలో సామూహిక వ్రతాలు

బిజినేపల్లి: మండలంలోని పాలెం వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భారీ జన సందోహం మధ్య రథోత్సవం ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. తేరు ప్రారంభమయ్యే సమయానికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వెలుగు జిలుగుల జిమ్మె పటాసులు పేల్చారు. రథోత్సవం తిలకించడానికి శనివారం రాత్రి చుట్టు పక్కల మండలాల నుంచి భక్తులు గ్రామానికి చేరుకుని ఆదివారం తెల్లవారుజాము వరకు వీధుల్లో పాలెం రథోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం అలవేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామి వార్లకు నిత్యారాధన, ప్రభంద పారాయణం, హోమ బలిహారణం, నివేదన, తీర్థ ప్రసాద వితరణ, సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు, స్వామి వారం రథోత్సవం ఘనంగా నిర్వహించారు.



సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా గట్టుతిమ్మప్ప రథోత్సవం



మాద్వార్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

మక్తల్: మండలంలోని మాద్వార్‌లో గట్టుతిమ్మప్ప స్వామి (లక్ష్మీవేంకటేశ్వరస్వామి) రథోత్సవం శనివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. కొండపైనుంచి స్వామిని తీసుకువచ్చి రథోత్సవంపై కూర్చొబెట్టి పూజలు చేశారు. బాల ఆంజనేయస్వామి దేవాలయం వరకు రథాన్ని వేలాది మంది భక్తుల కోలాహలం మధ్య లాగారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బాల్‌రాంరెడ్డి, రాజేశ్వర్‌రావు, లక్ష్మమ్మ, ఇందిర, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

గట్టుతిమ్మప్పస్వామి కల్యాణోత్సం శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం గుట్టపైనుంచి స్వామి వారిని కల్యాణం మంటపం వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

కర్నిలో గుండురంగస్వామి..

కర్ని గ్రామ శివారులోని గుండురంగస్వామి రథోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 11గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం ఉత్సవ మూర్తి విగ్రహాన్ని ఊరేగింపుగా రథం వద్దకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆలయానికి భక్తులు వేలాదిగా పాల్గొని స్వామి వారిని దర్శించుకోన్నారు.

ఆంజనేయస్వామికి అవభృత స్నానం

ధరూరు: పెద్ద చింతరేవుల ఆంనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ సమీపంలోని కృష్ణానదిలో అవభృత స్నానం, పల్లకీ సేవ చేపట్టారు. ఉదయం స్వామి వారి ఉత్సవమూర్తులను పల్లకీలో ఊరేగింపుగా నది వరకు తీసుకువెళ్లి శనివారం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అవభృత స్నాన ఘట్టం ముగించారు. అనంతరం ఆలయం వద్ద ధ్వజారోహణం చేసి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, జెన్‌కో అధికారులు దర్శించుకున్నారు.



కృష్ణానది తీరంలో స్వామి వారికి అవభృత స్నానం చేయిస్తున్న పండితులు

రాష్ట్రాభివృద్ధికి మంత్రులు పాటుపడాలి




మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ క్రైం: రాష్ట్ర అభివృద్ధికి పాటుపడటంతోపాటు.. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్, మంత్రులు సమయం కేటాయించాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంగమేశ్వరం లిఫ్టు పనుల కోసం అక్రమంగా తెలంగాణ మట్టి, రాళ్లు, ఇసుకను తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తెలంగాణ ఆవిర్భావం నీళ్లు, నిధులు, నియామకాల కోసం జరిగినా వాటి ని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చడం లేదన్నారు. రాష్ట్రంలో వసతి గృహాలను అద్దె భవనాల్లో, ఇరుకు గదుల్లో ఏర్పాటు చేసి విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతోపాటు విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులైన అధునాతన భవనాలు, మూత్రశాలలు వంటివి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను పూర్తి చేయించేందుకు గాను త్వరలోనే నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 30 నుంచి నియోజకవర్గంలో హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభిస్తామన్నారు.

వ్యవసాయరంగాన్ని ప్రైవేటీకరించేందుకు కుట్ర

నారాయణపేట టౌన్: వ్యవసాయ రంగాన్ని క్షీణింపచేసి క్రమక్రమంగా సబ్సిడీలు ఎత్తివేసి బడా కార్పొరేట్లకు దారాదత్తం చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ కుట్రలు చేస్తున్నారని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా కార్యాలయంలో ఏఐపీకేఎస్ జిల్లా సర్వసభ్య సమావేశం సంఘం అధ్యక్షుడు సలీం అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ దేశంలో రైతాంగం పరిస్థితి దినదినానికి దిగజారిపోతుందన్నారు. దేశానికి అన్నం పెట్టే వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇకనైనా మేల్కొని రైతులకు మేలు చేసేలా ప్రభుత్వాలు వ్యవహరించాలని కోరారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి రాము, ఏఐపీకేఎస్ జిల్లా కార్యదర్శి యాదగిరి, ఉపాధ్యక్షుడు భగవంతు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహా, కిరణ్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐపీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.కృష్ణ

శ్రీ సూర్యనారాయణ మేలుకో..!

- స్వామి ఆలయంలో ఘనంగా రథసప్తమి వేడుకలు
- జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి గ్రూప్ సంస్థలలో భాగమైన సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆలయాన్ని అధిక సంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శనివారం ఉదయం దేవస్థానం ఈఓ పురేందర్‌కుమార్ స్వామి వారి ఆలయం నుంచి సూర్యప్రభ వాహనంపై ఉత్సవ మూర్తుల రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆలయంలో ప్రముఖులు

జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాన్ని సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ అమిత్ గోయల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారితో పాటు రైల్వే అధికారి మోతిలాల్ ఉన్నారు. వీరికి దేవస్థానం వారు పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సమీపంలో చేపడుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనుల పరిశీలనలో భాగంగా ఇక్కడికి వచ్చారు. ప్రముఖ హాస్యనటి శ్రీలక్ష్మి, ప్రమోదిని అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనార్థ వచ్చిన భక్తులు హాస్య నటి శ్రీలక్ష్మితో మాట్లాడి, సెల్ఫీలు దిగారు.



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈఓ పురేందర్‌కుమార్